క్లుప్తంగా

నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ సంజయ్

రెబ్బెన: గణేశ్ నిమజ్జన ఉత్సవాలను మండలంలో ప్రశాంతంగా జరుపుకోవాలని రెబ్బెన సీఐ సంజయ్ సూచించారు. సోమవారం స్థానిక సీఐ కార్యాలయంలో గణేశ్ మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలు ఉపయోగించకూడదని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌కు అనుగుణంగా వాహనాలు నడపాలని, మైనర్లు నడపకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్సై చంద్రశేఖర్, గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రావూల వినోద్ అన్నారు. పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా సోమవారం పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ పెన్షన్ విధానంతో ఉపాధ్యాయులకు నష్టం కలుగుతుందని, పాత విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

కాగజ్‌నగర్‌టౌన్: అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు, యూరియా బస్తాలను రైతులకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రామకృష్ణ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. దుకాణాల్లో రైతులకు కనపడేలా ధరల పట్టికలు, స్టాక్ వివరాల బోర్డులను అమర్చాలని సూచించారు. ఎరువులను పీఓఎస్ మిషన్ల ద్వారానే పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా డీలర్లు అధిక ధరలకు ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే తమకు తెలియజేయాలన్నారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.

యూరియా కోసం వచ్చిన రైతులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం వద్ద యూరియా కోసం వచ్చిన రైతులకు సోమవారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు యూరియా కొరత తీర్చకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. సంఘం చైర్మన్ మాంతయ్య, నాయకులు శైలజాగౌడ్, మధుకర్, బ్రహ్మయ్య, వసంత్‌రావ్, బాపు, తిరుపతి, శ్రీనివాస్, ఫణిందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై అసత్య ప్రచారం మానుకోవాలి



కుమురం భీం చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

కౌటాల: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం మానుకోవాలని మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై విషం చిమ్ముతూ కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన అసత్య వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాగపూరి బండు, కోకన్వీనర్ ఆదే నాందేవ్, మహిళ కన్వీనర్ దుర్గం మమత, నాయకులు సత్యనారాయణ, నవీన్, గోగర్ల సాయికుమార్, జనార్దన్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన తిర్యాణి



30 పడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- రోజురోజుకూ పెరుగుతున్న జ్వర పీడితులు
- గ్రామాల్లో కానరాని ఫాగింగ్
- నమోదవుతున్న డెంగీ కేసులు
- వారం వ్యవధిలో ఇద్దరు మృత్యువాత

తిర్యాణి: ఏజెన్సీ మండలం తిర్యాణిలో ప్రజలు జ్వరాలతో వణికిపోతున్నారు. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా దాదాపు అన్ని గ్రామాల్లో గత వారం రోజుల నుంచి జ్వర పీడితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మండలంలోని ప్రభుత్వాసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. కాగా ఎక్కువగా వైరల్ ఫీవర్‌తో పాటు టైఫాయిడ్, డెంగీ కేసులు నమోదవుతుండడం ప్రజలను కలవరపెడుతుంది. మండలంలో గిన్నెదరి, రొంపెల్లి, తిర్యాణిలో పీహెచ్‌సీలు ఉండగా మండల కేంద్రంలో సీహెచ్‌సీ ఆసుపత్రి ఉంది.

డెంగీ జ్వరాలు..

గ్రామాలల్లో ఇంటికి ఇద్దరు, ముగ్గురు జ్వర పీడితులు ఉన్నారు. సాధారణంగా మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో రోజుకు 50 మించకుండా ఓపీ నమోదవుతోంది. కానీ గడిచిన పది రోజుల నుంచి రోజుకు 80 నుంచి 120 వరకు ఓపీ నమోదవుతుండగా అందులో 50 శాతానికి పైగా జ్వరంతో బాధపడుతున్న వారు ఉంటున్నారు. సీహెచ్‌సీ పరిధిలో గడిచిన 15 రోజుల్లోనే 11 డెంగీ, ఐదు టైఫాయిడ్ కేసులు నమోదవడం జ్వర తీవ్రతకు అద్దం పడుతుంది. కాగా మండలవ్యాప్తంగా ఆగస్టు నెలలో 16 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సీహెచ్‌సీలో గిన్నెదరి బాలికల ఆశ్రమ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు డెంగీతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. కాగా వారం రోజుల వ్యవధిలోనే పంగిడిమాదర గ్రామానికి చెందిన ఆత్రం అనురాగ్(12), గిన్నెదరి గ్రామానికి చెందిన ఆడ సీతారాం(15) అనే ఇద్దరు బాలురు డెంగీ జ్వరంతో బాధపడుతూ మృతి చెందడం విదితమే.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి



గత వారం రోజుల నుంచి మండలంలోని ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడి మండలంలోని అన్ని గ్రామాలల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో దోమల వ్యాప్తి నివారణకు దోమల మందు పిచికారీ చేయాలి. కానీ సంబంధిత అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. వెంటనే అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాలి. – తోడసం భాస్కర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు

దోమల నివారణ మందు పిచికారీ లేక..

వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ (దోమల నివారణ మందు పిచికారీ) చేపట్టాల్సి ఉన్నా నేటికీ చాలా వరకు గ్రామాలల్లో ఫాగింగ్ చేపట్టలేదు. పలు గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఫాగింగ్ యంత్రాలు పాడైపోయినా వాటిని మరమ్మతులు చేసే వారు లేక మూలకుపడ్డాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది గ్రామాల్లో వందలాది మంది సీజనల్ వ్యాధుల బారినపడ్డారు. అయినప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ప్రతీ ఊరిలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండల వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేయాలని వృద్ధురాలి నిరసన



నిరసన తెలిపేందుకు వచ్చిన వృద్ధురాలు

కాగజ్‌నగర్‌టౌన్: బతికుండగానే చనిపోయినట్లుగా రికార్డులు సృష్టించి తన భూమిని కాజేశారని 90 ఏళ్ల వృద్ధురాలు సోమబాయి, తన ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆగస్టు 4న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాను కలిసి విన్నవించారు. నెల రోజులవుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో మళ్లీ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. వృద్ధురాలికి మద్దతుగా ఆమె కుమార్తెలు రుక్మిణి, విమల, మనవరాళ్లు లక్ష్మి, జ్యోతి, సీపీఎం పార్టీ నియోజకవర్గ సభ్యుడు ముంజం ఆనంద్‌కుమార్ నిరసనలో పాల్గొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి రాములు

ఆసిఫాబాద్‌అర్బన్: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధులు కార్మికుల కోసమే ఖర్చు చేయాలన్నారు. 60 ఏళ్లు దాటిన కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ సంఘం ఆసిఫాబాద్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కమలాకర్, కార్యదర్శిగా నర్సయ్య, కోశాధికారిగా సదయ్య, ఉపాధ్యక్షులుగా శంకర్, రాంచందర్, వెంకన్న, సహాయ కార్యదర్శులుగా మల్లేశ్, సత్యనారాయణ, సోను, సభ్యులుగా నరేశ్, మహేశ్, మురళీ, అనిల్, కొండయ్య, బిల్లును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌గనర్ మండలంలోని వంజీరిలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపీడీవో కోట ప్రసాద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక సదుపాయాలు పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని మూత్రశాలలు, వంటగది, ఇంకుడు గుంత లేకపోవడాన్ని గమనించి సౌకర్యాలు కల్పించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'కాంగ్రెస్‌తోనే 42శాతం రిజర్వేషన్లు అమలు సాధ్యం'



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి నిబంధనను ఎత్తివేస్తూ బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచేందుకు అసెంబ్లీ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో డీసీసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జూడో యాత్రలో రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు బాలేష్‌గౌడ్, అనిల్‌గౌడ్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, చరణ్, రమేశ్ పాల్గొన్నారు.

ఎస్పీని సన్మానించిన ఆదివాసీ నాయకులు



ఎస్పీని సన్మానిస్తున్న ఆదివాసీ నాయకులు



న్యాయవాదిని సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జైనూర్ మండలంలో గతేడాది గిరిజన మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. 30 వేల జరిమానా విధించిన కేసులో పోలీసుల కృషిని అభినందిస్తూ జైనూర్ మండలానికి చెందిన ఆదివాసీ నాయకులు ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను సోమవారం శాలువాతో సన్మానించారు. ఈ కేసులో అరెస్టయిన ఆదివాసీలకు ఉచిత న్యాయ సహాయం అందించి, జైలు నుంచి బెయిల్‌పై విడుదల చేయించిన సీనియర్ న్యాయవాది బోనగిరి సతీశ్‌బాబును ఆదివాసీ నాయకులు శాలువాతో సన్మానించారు. రాజ్‌గోండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనక దేవేందర్, ఆదివాసీ సంఘాల నాయకులు మెస్రం మోతిరాం, ఆత్రం ఆనంద్‌రావు, ఆత్రం భగవంత్‌రావు, ఆనంద్‌రావు, కుమ్రం దుందేరావు, భీమ్‌రావు, శ్యాంరావు, ఆత్రం అర్జున్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లంబోదరుడికి పూజలు



ఆసిఫాబాద్: సామూహిక కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు

కెరమెరి: గణపతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు భక్తులు నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని బెస్తావాడ, శివాలయం, సేవాదాస్ నగర్, విద్యానగర్, నెహ్రూనగర్, చందుగూడ తదితర ప్రాంతాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక నైవేద్యంతో పూజలు చేశారు. భక్తులు ఉదయం, సాయంకాలం వేళల్లో మంగళహారతులిచ్చారు. చిన్నా, పెద్ద అనే తారతమ్యం లేకుండా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. వాడవాడలా నెలకొల్పిన గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహిళలు పెద్దఎత్తున మంగళహారతులతో హాజరవుతున్నారు. నవరాత్రుల్లో 6వ రోజులో భాగంగా జిల్లా కేంద్రంలోని పొట్టిశ్రీరాములు చౌక్‌లోని గణేశ్ మండపం వద్ద అర్చకులు శిరీష్ శర్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో సింగిల్ విండో డైరెక్టర్ పుల్లూరి మనీషా –సతీశ్ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం వినాయకుడికి 21 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. సామల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో సిద్ధి వినాయక గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన లంబోదరుడిని తహసీల్దార్ సూర్య ప్రకాశ్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండపంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ సంజయ్, ఎస్సై చంద్రశేఖర్‌లు సైతం హాజరయ్యారు. నిర్వాహకులు మోడెం సుదర్శన్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్, ఆర్‌ఐలు సామ్య, ఉదయ్‌కుమార్, నాయకులు సర్వేశ్వర్ గౌడ్, చిరంజీవిగౌడ్, ఇంగు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి: శివాలయంలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు



బెజ్జూర్: వినాయకుడికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు



రెబ్బెన: వినాయకుడిని దర్శించుకుంటున్న తహసీల్దార్ సూర్య ప్రకాశ్

పారదర్శకంగా సింగరేణి క్వార్టర్ల కేటాయింపు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న రాజమల్లు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులకు కంపెనీ క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని ఎస్‌వోటూ జీఎం కే. రాజమల్లు అన్నారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు నివాస క్వార్టర్ల కేటాయింపు కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల బెల్లంపల్లి ఏరియాకు బదిలీపై వచ్చిన ఉద్యోగులు, నూతనంగా విధుల్లో చేరిన ఉద్యోగులు క్వాటర్ల కోసం దరఖాస్తు చేసుకోగా కౌన్సెలింగ్‌లో ఎంచుకున్న క్వాటర్లను సీనియార్టీ ప్రతిపాదికన కేటాయించారు. పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్, సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ సాయి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



పెద్దవాగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నిర్వహించే గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు, భారీ వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు సీఐ బాలాజీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గజానంద్‌లు తెలిపారు. సోమవారం ఆసిఫాబాద్ పెద్దవాగు పరిసర ప్రాంతాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ ఈనెల 5న నిర్వహించే గణేశ్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్ల మరమ్మతు చేపట్టాలి

చింతలమానెపల్లి: భారీ వర్షాలకు ధ్వంసమైన మండలంలోని కోయపల్లి –గూడెం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో భారీ వర్షాలు, వరదలకు రోడ్లు కోతకు గురై గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కర్జెల్లి నుంచి గూడెం వరకు మంజూరైన రోడ్డును అటవీశాఖ అధిరులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ధ్వంసమైన 12 రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పాల్వాయి సుధాకర్‌రావు, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, తదితరులు ఉన్నారు.

పక్కా భవనాలు మంజూరు చేయాలి

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ గ్రామపంచాయతీకి ప్రభుత్వ భవనాలు మంజూరు చేయాలని కోరుతూ యువకులు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం లేదని, దీంతో చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న శిథిలావస్థ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరి వర్షపు నీరు చేరుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి గ్రామానికి భవనాలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యువకులు మేకల ఇస్తారి, మేకల శేఖర్, సాయి, కిశోర్, శ్రావణ్, అరుణ్, మల్లేశ్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

'డిజిటల్ లిటరసీపై అవగాహన అవసరం'



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయులకు డిజిటల్ లిటరసీపై అవగాహన అవసరమని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో సోమవారం ఉపాధ్యాయులకు ఆధునిక బోధనపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ టూల్స్ ద్వారా బోధించి, విద్యార్థుల్లో విషయ అవగాహన, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించాలన్నారు. కోడింగ్ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఫిజికల్ కంప్యూటింగ్ అంశాల పై మూడు రోజులపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు రాకేశ్, శ్రీనాథ్, శ్యాంసుందర్, సంతోష్, ప్రిన్సిపాల్ మహేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మండల స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలతో పాటు నృత్యాల్లో ముందుండాలని తెలిపారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలలకు చెందిన బాలికలు నృత్యాలు, పాఠాలు, కథలు చెప్పారు. విద్యార్థినులు శైలజ, అక్షర, శిరీష, అంజలి, రాజేశ్వరి పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రమేశ్, జలపతి, సంధ్యారాణి, భువనేశ్వరి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జయరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో పఠనోత్సవం

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రీడ్ ఏ థాన్ కార్యక్రమాన్ని హెచ్‌ఎం సంతోష్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి ప్రత్యేకంగా 15 రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీరోజు 30 నిమిషాల పాటు విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్ మేళా, స్టోరీ పరేడ్స్, స్టోరీ క్రియేషన్స్‌పైన వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ వెంకటేశ్, ఉపాధ్యాయులు కమలాకర్‌రెడ్డి, శిల్ప, సుమిత, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన



నష్టపోయిన పత్తి చేను పరిశీలిస్తున్న ఏఈవో

కాగజ్‌నగర్‌టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పెద్దవాగు పరీవాహక ప్రాంతాలైన బారెగూడ, అందవెల్లి, జగన్నాథ్‌పూర్, బోడపల్లి, రాస్పెల్లి గ్రామాల్లో నష్టపోయిన పంటలను సోమవారం ఏఈవోలు పరిశీలించారు. బారెగూడ, పెద్దవాగు పరీవాహక ప్రాంతాల్లోని పత్తి చేలు వరద తాకిడికి పూర్తిగా పాడవడంతో ఎంత విస్తీర్ణంలో పంట నష్టం జరిగిందో వివరాలు అంచనా వేశారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సృజనలు ఉన్నారు.